క్లుప్తంగా

నేడు తైబజార్, మేకల సంతకు వేలం

మహేశ్వరం: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం ఉదయం 10.30గటలకు తైబజార్, మేకల సంతకు వేలం నిర్వహించున్నట్లు పంచాయతీ కార్యదర్శి వజ్రలింగం సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికిగాను ఈ వేలం నిర్వహిస్తున్నామని వివరించారు. వేలంలో పాల్గొనదలిచిన వారు రూ.5వేల నగదు డిపాజిట్ చేయాలని సూచించారు.

నేడు బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం

మహేశ్వరం: మండల పరిధిలోని అమీర్‌పేట్ గ్రామంలో మంగళవారం బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ వర్కల యాద గిరిగౌడ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్.రమణ, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి హాజరవుతారని చెప్పారు. ఈ సమావేశానికి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఆలయ పునఃనిర్మాణానికి భూమిపూజ



భూమి పూజలో పాల్గొన్న గ్రామస్తులు

కందుకూరు: మండల పరిధిలోని బేగంపేటలో వీరాంజనేయస్వామి ఆలయ పునఃనిర్మాణానికి సోమవారం గ్రామస్తులు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన హోమంలో భక్తులు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ'కి సహకరించండి

పీహెచ్ఎస్ వైద్యురాలికి వినతి



డాక్టర్ రాధికకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ, ఆశ వర్కర్ల సంఘం ప్రతినిధులు

కందుకూరు: కేంద్ర ప్రభుత్వం వైఖరికి నిరసనగా ఏప్రిల్ 5న ఢిల్లీలో చేపట్టనున్న కార్యక్రమానికి విచ్చేయనున్న ఆశవర్కర్లకు సహకరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాలరాజు కందుకూరు పీహెచ్‌సీ వైద్యురాలు రాధికకు సోమవారం వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఆశవర్కర్లు ఎం.శైలజ, జె.అరుణ, జి.లావణ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి

కొలన్‌గూడ సర్పంచ్ గీతేశ్వరి



సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ తదితరులు

కందుకూరు: గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని కొలన్‌గూడ సర్పంచ్ గీతేశ్వరిగణేశ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని కొలన్‌గూడలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. మంత్రి సబితారెడ్డి సహకారంతో గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధికి పనులకు ప్రతీ ఒక్కరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బండ విజయశ్రీనివాస్, బీఆర్ఎస్ మండల బీసీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ జి.బీరప్ప, వార్డు సభ్యులు ఎ.శంకర్‌కుమార్, ఎ.రజితకృష్ణ, పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

నాటక రంగాన్ని కాపాడుకోవాలి

వనస్థలిపురం: అంతరించిపోతున్న నాటక రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత కళాభిమానులపై ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని పురస్కరించుకుని వేదభూమి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం వనస్థలిపురంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ కళావేదికపై పలువురు రంగస్థల కళాకారులను సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీ కృష్ణరాయబారంలోని ఉపప్లావ్య ఘట్టం పౌరాణిక పద్య నాటకాన్ని ప్రదర్శించారు. అంతకు ముందు రంగస్థల కళాకారులు డాక్టర్ కొండేపూడి శ్రీనివాసరావు జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో వి.సూర్యప్రకాష్, సి.హెచ్.వి.ఆర్.కె.మూర్తి, హరనాథ్, నరసింగరావు, బాలనాగేశ్వర్‌రావు, మంగపతిరావు, కవితారెడ్డి, భాస్కర్‌రావు, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

కాసులు కురిపిస్తున్న కొత్తిమీర

- నీటి వసతి ఉంటే ఏడాదిపాటు సాగుకు అనుకూలం
- మహేశ్వరం ఉద్యానవన అధికారి సలహాలు, సూచనలు

వంటలకు రుచిని, సువాసన ఇచ్చే కొత్తిమీరకు ప్రత్యేక స్థానం ఉంది. మిగిలిన అన్ని కాలాలలో విరివిగా దొరికినా వేసవిలో మాత్రం కొత్తిమీర ధర కొండెక్కుతుంది. వేసవిలో ఉండే అధిక ఉష్ణోగ్రతలతో మొలక శాతం తగ్గడంతోపాటు ఆకు పెరుగుదల మందగిస్తుంది. అందుకే వేసవిలో కొత్తిమీరకు డిమాండ్. అధిక ఉష్ణోగ్రతలను తట్టుకోవాలంటే కొత్తిమీర సాగులో మెలకువలు తప్పనిసరి.



మహేశ్వరం: నీటి వనరులు ఉంటే చాలు ఏడాది పొడవునా కొత్తిమీర సాగు చేయవచ్చు. ఈ సాగులో శ్రమ, పెట్టుబడి తక్కువ. సాగుకు అనుకూలంగా ఉన్న వ్యవసాయ పొలాల్లో గానీ, ఇంటి పెరట్లో గానీ కొత్తిమీర సాగు చేసుకోవచ్చు. వేసవిలో ఆకు కొరకు తగినంత నీడలో కూడా సాగు చేసి మార్కెట్లో విక్రయించడానికి అవకాశాలు మెండుగా ఉన్నాయి.

రకాలు

సింధు, సాధన, స్వాతి, సుధ

నేలలు

వర్షాధారం కింద నల్లరేగడి, నీటి వసతి కలిగిన గరప నేలలు, ఎర్ర నేలలతో పాటు తేలికపాటి భూములు అనుకూలం.

నేల తయారీ, విత్తుకునే విధానం

- కొత్తిమీర సాగు చేసే నేలలను నాలుగు సార్లు కలియదున్నుకోవాలి. తేమను బట్టి సాలు నడుమ 30 సెం.మీ, మొక్కల మధ్య 10 సెం.మీ వెడం ఉండేలా గొర్రుతో విత్తనాలను విత్తుకోవాలి.
- విత్తనాలను బద్దలు చేసి విత్తితే రెండు మూడు రోజుల్లో మొలకలు వస్తాయి.
- విత్తే ముందు ఆరు గంటల సేపు నానబెట్టి తర్వాత ఆర బెట్టాలి. అనంతరం విత్తడంతో మొలకలు త్వరగా వస్తాయి.
- ఎకరానికి 10 నుంచి 20 కిలోల విత్తనం సరిపోతుంది. విత్తే ముందు అజోస్పైరిలం మందు ఎకరానికి కలిపి శుద్ధి చేస్తే దిగుబడి శాతం పెరుగుతుంది.
- వేసవిలో దుక్కులను లోతుగా దున్నడం ద్వారా తెగుళ్లను కలుగజేసే శిలీంద్రాలను అదుపు చేయొచ్చు.

ఎరువులు..

- నీటి పారుదల కింద సాగవుతున్న కొత్తిమీర విత్తిన 30 రోజుల్లో 12 కిలోల యూరియా, 7 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను వేసుకోవాలి.
- వర్షాధారం కింద సాగయ్యే నల్లరేగడి నేలల్లో ఆఖరి దుక్కిలో ఎకరానికి 4టన్నుల పశువుల ఎరువుతో పాటు 25 కిలోల యూరియా, 100 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 15 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను వేసుకోవాలి.
- విత్తిన వెంటనే బరువు నేలల్లో ఎకరానికి పెండిమిథాలిన్ 1.3లీ, తేలిక నేలల్లో 1లీ, 200లీ నీటిలో కలిపి పిచికారీ చేసి కలుపును నివారించవచ్చు.
- దనియాల సాగుతో పాటు శనగ, కుసుమ, ఆవాలు పంటలను అంతర పంటలుగా వేసుకోవచ్చు.

సస్యరక్షణ చర్యలు

- ఆకులు, పూతను పేనుబంక పురుగులు ఆశిస్తాయి. రసాన్ని పీల్చి గింజలు ఏర్పడకుండా చేస్తాయి. వీటి నివారణకు లీటర్ నీటికి 1.6 మి.లీ మోనోక్రోటోఫాస్ కలిపి పిచికారీ చేయాలి.
- ఎర్రనల్లి పురుగులు ఆకుల అడుగు భాగాల్లో గుంపులుగా చేరి రసాన్ని పిల్చివేస్తాయి. వీటి నివారణకు లీటర్ నీటిలో కలిగే 3 గ్రాముల గంధాకాన్ని కలిపి పిచికారీ చేయాలి.
- తామర పురుగులు ఆశించి ఆకులు పూతను గీకి తింటాయి. వీటి నివారణకు లీటర్ నీటికి మిథైల్ డైమాటాన్ 2.0 మి.లీ కలిపి పిచికారీ చేయాలి
- పొగాకు లద్దె పురుగులు ఆశించి ఆకులను, పూతను గింజలను తిని నష్టాన్ని కలిగిస్తాయి. వీటి నివారణకు లీటర్ నీటికి ఎసిఫేట్ ఒక గ్రాము కలిపి పిచికారీ చేయాలి.

తెగుళ్లు

- బూడిద తెగులు, ఎండు తెగులు, గింజ నలుపు తెగులు ఆశించి నష్టపరుస్తాయి.
- బూడిద తెగులు ఆశించడంతో ఆకుల అడుగు భాగాల్లో బూడిద రంగు మచ్చలు ఏర్పడతాయి. క్రమంగా కాండానికి వ్యాపిస్తాయి. దీని నివారణకు లీటర్ నీటికి ఒక గ్రాము కార్బండిజమ్ కలిపి పిచికారీ చేయాలి.
- ఎండు తెగులు, గింజ నలుపు తెగులు ఆశించినప్పుడు ఆకులు వాలిపోయి ఎండిపోతాయి. దీని నివారణకు మాంకోజెబ్ 3 గ్రాములు.. ఒక లీటర్ నీటికి కలిపి పూత, గింజలు పట్టే దశలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

కోత విధానం

ఆకులు ఆరోగ్యంగా ఉన్నప్పుడు పూతరాక ముందే కోసి మార్కెట్‌కు తరలించి విక్రయించుకుంటే మంచి లాభాలు ఉంటాయి.

- కొత్తిమీర రకాలను బట్టి 40–45 రోజుల్లో పూత మొదలవుతుంది.
- 80–110 రోజుల్లో పక్వానికి వస్తాయి.
- 60 శాతం ధనియాలు పక్వానికి వచ్చినప్పుడు పంటను కోయాలి.
- ఉదయం పంటను కోసి పొలంలోనే మూడు రోజుల పాటు ఆరనిచ్చి నూర్పిడి చేసుకోవాలి.
- దనియాలను అప్పుడప్పుడు ఎండబెట్టుకోవాలి. ఇలా చేయడంతో గింజలను ఆశించే పురుగులను నివారించుకోచ్చు.
- దనియాల సంచులపై మలాథాన్‌యాన్ చల్లడంతో ఎక్కువ రోజులు నిలువ ఉంచుకోవచ్చు.

నీటి వసతితో ఏడాది పాటు సాగు



కొత్తిమీర ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ప్రతి ఇంట్లో వండే కూరల్లో కొత్తిమీర ఆకులను వినియోగిస్తుండడంతో మార్కెట్లోనూ మంచి డిమాండ్ ఉంటుంది. కొత్తి మీరను ఏడాది పొడవునా సాగు చేయడంతో పాటు, ధనియాల దిగుబడిని సాధించవచ్చు. నీటి వసతి ఉంటే కొత్తిమీరను సాగు చేస్తే అధిక దిగుబడితో పాటు, మార్కెట్లోనూ లాభాలు పుష్కలంగా ఉంటాయి. – సౌమ్య, మండల ఉద్యానవన అధికారి, మహేశ్వరం

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



పాల్గొన్న నాయకులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి శ్రీరాం కాలనీలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో వినాయక, సీతారామ, లక్ష్మణస్వాముల విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచే ప్రత్యేక పూజలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాం కాలనీకి చెందిన భక్తులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ బీసీ సెల్ అధ్యక్షుడిగా మల్లేశ్

మహేశ్వరం: బీఆర్ఎస్ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడిగా మన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వట్టెల మల్లేశ్ యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు మంత్రి సబితారెడ్డి సోమవారం ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లేశ్ యాదవ్ మాట్లాడుతూ.. పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతీ ఒక్కరికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. బీసీ కులాల సంక్షేమానికి సీఎం కేసీఆర్ నిరంతరం తపిస్తున్నారని చెప్పారు. నిరుద్యోగ యువతకు బీసీ కార్పొరేషన్ రుణాలు ఇచ్చి వారి ఆర్థికాభివృద్ధికి సహకరిస్తున్నారని గుర్తు చేశారు. నియోజకవర్గంలో బీసీ కులాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. తనపై నమ్మకంతో పదవి అప్పగించిన మంత్రి సబితారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, నియోజకవర్గ సీనియర్ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

సర్పంచ్ మల్లారెడ్డి



పంచాయతీ సిబ్బందిని సన్మానిస్తున్న సర్పంచ్ తదితరులు

కందుకూరు: ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కొత్తగూడ సర్పంచ్ సాధ మల్లారెడ్డి కోరారు. సోమవారం మండల పరిధిలోని కొత్తగూడలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్, ఆయుష్మాన్ భారత్, రైతు బంధు, రైతు బీమా వంటి పథకాల ప్రయోజనాలను గ్రామస్తులు అందిపుచ్చుకోవాలని, అందుకు ఈకేవైసీ చేసుకోవాలన్నారు. గ్రామ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు, పరిష్కరించాల్సిన సమస్యలను గ్రామ సభకు ఏకరువు పెట్టారు. అనంతరం పంచాయతీ సిబ్బందిని సన్మానించి వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తాళ్ల పద్మ, వార్డు సభ్యులు బండారు సునీత, హన్మంత్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, అజీజ్‌ఖాన్, కోఆప్షన్ సభ్యుడు బొక్క బాల్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్ సరస్వతి, మహిళా సంఘాల ప్రతినిధులు మంజుల, సీసీ నర్సింహ, వ్యవసాయాధికారులు రాజు, ఏఎస్ఆర్‌జీఎస్ అధికారి తిరుపతిరావు, పంచాయతీ కార్యదర్శి శివశంకర్, గ్రామస్తులు బి.సత్యనారాయణరెడ్డి, బి.ప్రభాకర్‌రెడ్డి, బాలేశ్‌ముదిరాజ్, ఎల్లారెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ సాధించే వరకు విశ్రమించం

ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్ కృష్ణ మాదిగ



కందుకూరులో ఎమ్మార్పీఎస్ నాయకుల పాదయాత్ర

కందుకూరు: ఎస్సీ వర్గీకరణ బిల్లుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపే వరకు విశ్రమించేది లేదని ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్లు కృష్ణమాదిగ, గ్యార సురేశ్ మాదిగ, మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి రావుగళ్ల బాబు మాదిగ అన్నారు. ఎస్సీ వర్గీకరణ బిల్లు అమలు కోసం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర సోమవారం కందుకూరుకు చేరుకుంది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్గీకరణ చట్టబద్ధత కల్పించడంలో మాట నిలబెట్టుకోని బీజేపీని దేశం ఎల్లలు దాటిస్తామని హెచ్చరించారు. మాదిగలకు రాజ్యాంగ ఫలాలు అందకుండా చేస్తే ఉపేక్షించేదిలేదన్నారు. దేశ సంపద అగ్రకులాలకే దోచిపెడుతున్నారని, పేదలను పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఏప్రిల్ 4న చేపట్టనున్న హైదరాబాద్ దిగ్బంధం కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా శ్రేణులు కదిలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ యువజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోళ్ల రాఘవేందర్, ఎమ్మార్పీఎస్ నియోజకవవర్గ ఇన్‌చార్జి ఎర్ర నవీన్‌కుమార్, నాయకులు బక్కని రవికుమార్ మాదిగ, ఎంఎస్‌పీ నాయకులు ముచ్చర్ల నరసింహమాదిగ, మహేశ్వరం మండల అధ్యక్షుడు శేఖర్‌మాదిగ, బాలాపూర్ ఇన్‌చార్జి తొట్ల శ్రీనివాస్, గోల్కొండ సుధాకర్, చిన్నగళ్ల యాదగిరి, చిర్రా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి



జల దినోత్సవ ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

బడంగ్‌పేట్: రెండు ప్రపంచ యుద్ధాల గురించి తెలుసున్నాం.. కానీ మూడో ప్రపంచ యుద్ధం అనేది జరిగితే అది నీటికోసమే.. అందుకే నీటిని పొదుపుగా వాడుకుని భవిష్యత్ తరాలకు అందించే బాధ్యత మనపై ఉందని హెచ్ఎం అర్జున్ విద్యార్థులకు సూచించారు. బడంగ్‌పేట జెడ్పీహెచ్ఎస్‌లో సోమవారం ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా జలమండలి అధికారుల సహకారంతో గాయత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం అర్జున్, ఫౌండేషన్ అధ్యక్షుడు బానాల రవికుమార్ మాట్లాడుతూ.. ప్రతీ కుటుంబం నీటిని పొదుపుగా వాడుకోవాలని విద్యార్థులకు సూచించారు. కట్టబోయే ప్రతి ఇంటి నిర్మాణానికి తప్పనిసరి ఇంకుడు గుంత నిర్మించుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో నీటిని పొదుపుగా వాడుకునేలా ప్రతిజ్ఞ చేయించి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గాయత్రి ఫౌండేషన్ సభ్యులు స్వాతి, హర్షవర్ధన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆసక్తిని గుర్తించి ప్రోత్సహిస్తే మెరుగైన ఫలితాలు

న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి శ్రీదేవి



శ్రీదేవితో సర్టిఫికెట్లు అందుకున్న చిన్నారులు

మీర్‌పేట: చిన్నారుల్లోని ఆసక్తిని గుర్తించి ప్రోత్సహిస్తే భవిష్యత్తులో మెరుగైన ఫలితాలు సాధిస్తారని న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎ.శ్రీదేవి అన్నారు. మీర్‌పేట గాయత్రినగర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో నిర్వహించిన ప్రీ ప్రైమరీ విద్యార్థుల స్నాతకోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యార్థులను చదువుతో పాటు అన్ని రంగాల్లో ప్రోత్సహించాలన్నారు. అనంతరం ఎల్‌కేజీ పూర్తి చేసుకున్న చిన్నారులకు ఆమె మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల డీన్ ప్రమీల, డీఏ క్రాంతికుమార్, ప్రధానోపాధ్యాయురాలు కుముదవల్లి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుట్రలతో పోరాటాన్ని ఆపలేరు

కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వేం నరేందర్‌రెడ్డి



సత్యాగ్రహ సంకల్ప దీక్షలో మాట్లాడుతున్న వేం నరేందర్‌రెడ్డి

మీర్‌పేట: మోదీ ఎన్ని కుట్రలు చేసినా.. బీజేపీ ప్రభుత్వంపై చేస్తున్న పోరాటాన్ని అడ్డుకోలేరని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వేం నరేందర్‌రెడ్డి హెచ్చరించారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మీర్‌పేట చందన చెరువుపై గాంధీ విగ్రహం వద్ద సత్యాగ్రహ సంకల్ప దీక్ష నిర్వహించారు. ఈ దీక్షకు ముఖ్య అతిథిగా హాజరైన వేం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి, దేశ ప్రజలకు ఆశాజ్యోతిగా ఉన్న రాహుల్‌గాంధీ సారథ్యంలో భవిష్యత్‌లో కాంగ్రెస్ అధికారంలోకి రావద్దనే కక్షతోనే బీజేపీ కుట్ర చేస్తోందన్నారు. రాహుల్‌గాంధీ పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయడంతో పాటు రెండేళ్ల జైలుశిక్ష విధించి బీజేపీ చరిత్రలో దిద్దుకోలేని తప్పు చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాలకు అతీతంగా నేడు అన్ని పార్టీలు, అన్ని వర్గాల ప్రజలు రాహుల్‌గాంధీకి సంఘీ భావంగా రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేస్తున్నారని వివరించారు. రాష్ట్రంలో ఓ వైపు ప్రజా సమస్యలు, ప్రశ్నపత్రాల లీకేజీలపై పోరాటం చేస్తూనే, జిల్లా, నియోజకవర్గ కేంద్రాల్లో అధిష్టానం ఆదేశాల మేరకు అన్ని కార్యక్రమాలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, బడంగ్‌పేట మేయర్ పారిజాత మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ కులాలు, మతాల పేరుతో విద్వేశాలను రెచ్చగొడుతోందని ఆరోపించారు. దేశాన్ని అభివృద్ధి వైపు తీసుకెళ్లి, ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు జోడోయాత్ర చేపట్టడం జరిగిందన్నారు. దేశ సంపదను అంబానీ, ఆదానీలకు దోచిపెడుతున్నారని ప్రశ్నించినందుకే రాహుల్ గాంధీని జైలులో పెట్టడంతో దేశ ప్రజలంతా ఖండిస్తున్నారన్నారు. దేశంలో బీజేపీకి చెందిన ఎంతో మంది ఎంపీలపై క్రిమినల్ కేసులు ఉన్నాయని, వారందరి సభ్యత్వాన్ని ఎందుకు రద్దు చేయించలేదని ప్రశ్నించారు. ఈ దీక్షలో మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, నాయకులు సంకేపల్లి సుధీర్‌రెడ్డి, మల్‌రెడ్డి రాంరెడ్డి, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, అమరేందర్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, బంగారు బాబు, సామిడి గోపాల్‌రెడ్డి, చల్లా బాల్‌రెడ్డి, సిద్దాల శ్రీశైలం, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ నవమికి ఆహ్వానం

మహేశ్వరం: మండల పరిధిలోని నాగారం హనుమాన్ ఆలయంలో ఈ నెల 30న నిర్వహించే సీతారాముల కల్యాణ మహోత్సవానికి విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డికి సోమవారం ఆహ్వాన పత్రికలు అందజేశారు. వారిని ఆహ్వానించిన వారిలో బీఆర్ఎస్ గ్రామ నాయకులు బండారి లింగం ముదిరాజ్, ఉప సర్పంచ్ లతీఫ్‌ఖాన్ పలువురు గ్రామస్తులున్నారు.

అనాథ విద్యార్థులకు రేషన్ వితరణ



నిత్యావసర సరుకులను అందిస్తున్న ట్రస్టు సభ్యులు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ చిత్ర లేవుట్ కాలనీలోని అనాథ విద్యార్థి గృహ విద్యార్థులకు రూ. 30 వేల విలువైన రేషన్ సరుకులను యూసుఫ్‌గూడ, ప్రగతినగర్‌కు చెందిన కదాలి గోపాల్ కృష్ణ భారతి చారిటబుల్ ట్రస్టు సభ్యులు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా మేనేజింగ్ ట్రస్టీ కె.వి.వి.గోపాలకృష్ణ మాట్లాడుతూ... అనాథ విద్యార్థి గృహం రెండు తెలుగు రాష్ట్రాల అనాథ, నిరుపేద విద్యార్థులకు భోజన, వసతి, విద్యా సౌకర్యాలు కల్పించి వారి భవిష్యత్తుకు కృషి చేస్తున్నదని తెలిపారు. ఈ నేపథ్యంలో నెలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజాశామన్నారు. రేషన్ వితరణ చేసిన ట్రస్టుకు గృహ అధ్యక్షుడు మార్గం రాజేష్ కృతజ్ఞతలు తెలిపారు.

నీటి పొదుపుపై అవగాహన ర్యాలీ

ఎల్‌బీనగర్: నీటిని పొదుపుగా వినియోగించుకుంటూ.. వృథా కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ అన్నారు. సోమవారం బీఎస్‌రెడ్డి కాలనీలో ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా జలమండలి, సేవ్ ఎర్త్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని ప్రముఖ వాస్తు నిపుణుడు కృష్ణాదిశేషుతో కలసి ఆయన ప్రారంభించారు.

నిధుల విడుదలపై స్పష్టత ఇవ్వండి

- యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి
- రోడ్ల అభివృద్ధి పనులకు ఏడాది క్రితం శంకుస్థాపన
- నేటికీ ప్రారంభించని కాంట్రాక్టర్



కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న రాఘవేందర్‌రెడ్డి

బడంగ్‌పేట్: రోడ్ల అభివృద్ధి పనులకు ఏడాది క్రితం రూ.20.60కోట్లు ప్రకటించామని చెబుతూ మంత్రులు శంకుస్థాపన చేశారని.. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ నేటికీ పనులు ప్రారంభించడం లేదని.. నిధులు మంజూరయ్యాయా..? పేపర్ ప్రకటనలకే పరిమితమయ్యాయా అనేది స్పష్టత ఇవ్వాలని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి సోమవారం కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డిని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అల్మాస్‌గూడ నుంచి గుర్రంగూడ వరకు రూ.3 కోట్లు, అల్మాస్‌గూడ టెలిఫోన్ కాలనీ నుంచి సాగర్ సొసైటీ వరకు రూ.2.40 కోట్లు, విద్యాభారతి పాఠశాల నుంచి వినాయకహిల్స్ మీదుగా శ్రీశ్రీ హోమ్స్ వరకు రూ.2.20 కోట్లు, ఇలా మొత్తంగా అల్మాస్‌గూడలోని పలు డివిజన్ల రోడ్ల అభివృద్ధికోసంతో పాటు బడంగ్‌పేట నుంచి అల్మాస్‌గూడ, బడంగ్‌పేట కమాన్‌నుంచి నాదర్‌గుల్ వరకు, అల్మాస్‌గూడ కమాన్ నుంచి మీర్‌పేట్ మీదుగా జిల్లెలగూడ వరకు, ఇలా రోడ్డు వెడల్పు, రోడ్ల విస్తరణకు మొత్తంగా సుమారు రూ.20.60కోట్లను మున్సిపల్ శాఖామంత్రి కేటీఆర్ ప్రత్యేక నిధులను, అలాగే హెచ్ఎండీఏ నిధులను ఏడాది క్రితం కేటాయించారు. కానీ ఈ పనులు శంకుస్థాపనకే పరిమితమయ్యాయి. నిధులు మంజూరు చేస్తే ఏడాది నుంచి పనులు ఎందుకు ప్రారంభిచలేదో చెప్పాలని కోరారు. ప్రజా అవసరాలను గుర్తించి వెంటనే పనులు ప్రారంభించేలా మంత్రి సబితారెడ్డి, కార్పొరేషన్ అధికారులు చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

జెడ్పీటీసీ సభ్యుడు జంగారెడ్డి



చెక్కు అందజేస్తున్న జంగారెడ్డి తదితరులు

కందుకూరు: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని జెడ్పీటీసీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని గూడూరుకు చెందిన యాదయ్యకు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.50 వేల చెక్కును సోమవారం కందుకూరులో అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అర్హులైన ప్రతీ ఒక్కరికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎం.జయేందర్ ముదిరాజ్, మాజీ సర్పంచ్ టి.దేవేందర్, నాయకులు శ్రీహరి, ఆనంద్, కార్తీక్, విఘ్నేశ్వర్‌రెడ్డి, బి.దీక్షిత్‌రెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను వినియోగించుకోవాలి

కంటి వెలుగు పథకాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, ఎంపీపీ మంద జ్యోతిపాండు సూచించారు. సోమవారం మండల పరిధిలోని ఆకులమైలారం గ్రామంలో సర్పంచ్ రాజుకలమ్మతో ఆయన కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు మాట్లాడుతూ.. ప్రజల మేలు కోసం ప్రభుత్వాలు అమలు చేసే పథకాలను స్వాగతించాలన్నారు. ఉచిత కంటి పరీక్షలు పేదలకు ఆసరాగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జయేందర్, ఎంపీటీసీ సభ్యురాలు పద్మపాండు, ఉప సర్పంచ్ రాంరెడ్డి, మాజీ సర్పంచ్ నందీశ్వర్, అంజయ్య, డైరెక్టర్ ఆనంద్, నియోజకవర్గ యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ కార్తీక్, కె.విఘ్నేశ్వర్‌రెడ్డి, బొక్క దీక్షిత్‌రెడ్డి, వెంకటేష్, జి.సామయ్య, సదానంద్‌గౌడ్, అమరేందర్‌రెడ్డి, వార్డు సభ్యులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.